సాక్షి చిత్తూరు

గురువారం । 21 । డిసెంబర్ । 2023




కౌశల్ పోటీల్లో ప్రతిభ

జిల్లాస్థాయి కౌశల్ పోటీల్లో ప్రభుత్వ స్కూళ్ల లోని విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైట్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం తెలిపారు. - 8లో



జగనన్న వెంటే జనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని చేపట్టిన పాదయాత్ర బుధవారం తిరుపతికి చేరింది. - 8లో



27న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకల లెక్కింపును 27న నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,236 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 113, తిరుపతి రూరల్ 39, పుత్తూరు 85, చిత్తూరు అర్బన్ 72, చిత్తూరు రూరల్ 56, మదనపల్లె 66, పీలేరు 30, పుంగనూరు పరిధిలో 104 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 535 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.99 లక్షలు, విద్యుత్ చౌర్యం కేసులు 30కు గాను రూ.25 వేలు జరిమానాతో కలిపి మొత్తం 565 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. మొత్తం రూ.13.24 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

23 నుంచి ద్రవిడ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం: ద్రవిడ వర్సిటీలో ఈ నెల 23 నుంచి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఐసెట్ 2023లో అర్హత పొందిన అభ్యర్థులు ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు జరిగే అడ్మిషన్లకు ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష శాఖలో సహాయ సెక్టోరల్ పోస్టుల భర్తీకి అర్హులైన ఇన్ సర్వీస్ టీచర్లు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్రశిక్ష శాఖ జిల్లా ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖలో ఖాళీగా ఉన్న 2 అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఇన్‌సర్వీస్ టీచర్లు పోస్టుగాడ్యుయేషన్‌లో గణితం, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులు చదివి ఉండాలన్నారు. ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత, గుర్తింపు పొందిన కంప్యూటర్ సంస్థ నుంచి డిగ్రీ, డిప్లొమా కోర్సు చదివి ఉండాలని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం 5 ఏళ్ల సర్వీస్, 2023 డిసెంబర్ 31 నాటికి గరిష్ఠంగా 50 ఏళ్ల వయసు నిండి ఉండకూడదని చెప్పారు. దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 28వ తేదీలోపు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పొందవచ్చని ఏపీసీ వెల్లడించారు.

పకడ్బందీగా అభ్యంతరాల పరిశీలన



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణలో నమోదైన అభ్యంతరాలను పకడ్బందీగా పరిశీలిస్తున్నామని డీఆర్‌ఓ రాజశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా కసరత్తులో నమోదైన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితా కసరత్తును పర్యవేక్షించేందుకు జిల్లా అబ్జర్వర్ పోలాభాస్కర్ ఈ నెల 22న సాయంత్రం 4.30 గంటలకు విచ్చేసి సమావేశం నిర్వహించనున్నారని, దీనికి రాజకీయపార్టీల ప్రతినిధులు హాజరు కావాలన్నారు. డిసెంబర్ 9 వరకు వచ్చిన అభ్యంతరాల పరిశీలన వేగవంతంగా జరుగుతోందన్నారు. 2024 జనవరి 5 ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. ఈవీఎంల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, పరదేశి, భాస్కర్, అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విదేశీ విద్యాదీవెన మెగాచెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీఎంతో సంతోషాన్ని పంచుకున్న విద్యార్థి..



సీఎంతో మాట్లాడుతున్న చంద్రసాయికృష్ణ

'వ్యవసాయ కుటుంబంలో పుట్టిన నాకు విదేశీ విద్యను చదివే భాగ్యం లేదు. కానీ మీరు నాకు ఆ అవకాశం కల్పించారు. మీ మేలును జీవితాంతం మరిచిపోను. నాకు ఆస్ట్రేలియాలోని మొనాష్ యూనివర్సిటీలో సీటు వచ్చింది. నా మొత్తం ఫీజు రూ.55,44,000 మీ ప్రభుత్వం చెల్లించడం ఎంతో ఆనందంగా ఉంది సార్'

– చంద్రసాయికృష్ణ, రామాపురం, నగరి

మీ సాయం మరువం

- మా జీవితాల్లో వెలుగులు నింపారు
- జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం అందుకున్న విద్యార్థుల ఆనందం
- జిల్లాలో 10 మంది విద్యార్థులకు రూ.1.25 కోట్లు ఆర్థిక సహాయం
- విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్న సీఎం జగన్
- జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థులకు వైఎస్సార్ సీపీ సర్కారు విదేశీ విద్య చదివే అవకాశాన్ని కల్పించడం చాలా గొప్ప విషయమని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కేవలం శ్రీమంతుల పిల్లలకే అందుబాటులో ఉన్న విదేశీవిద్యను పేద విద్యార్థులకు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీల్లో ర్యాంకింగ్స్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ ప్రకారం టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న కళాశాలల్లో ప్రభుత్వం ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాదిలో 10 మందికి గానూ రూ.1.25 కోట్లు ఆర్థిక సహాయం అందుతున్నట్లు చెప్పారు. ఈ పథకం ప్రయోజనంపై వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బందితో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విదేశీ విద్యాదీవెన పథకం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, ఎంఎల్‌సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, పాల ఏకరి సంఘం చైర్మన్ కుమార రాజా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్‌పర్సన్ శైలజా రెడ్డి, జెడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల జిల్లాస్థాయి అధికారులు డా.రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో చదవలేని పరిస్థితి..



"మాది పేద కుటుంబం. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంలో భాగంగా నాకు న్యూయార్క్ యూనివర్సిటీలో సీటు వచ్చింది. అక్కడ ఫీజు రూ.66,61,872 ప్రభుత్వమే మంజూరు చేస్తోంది. సీఎం జగన్ సారు మేలు ఎప్పటికీ మరిచిపోను. – పూజిత, బిరాల

కొండంత మేలు చేశారు..



నా పేరు భానుప్రకాష్.. నాది గుడిపాల మండలం బొమ్మసముద్రం. మా కూతురు రమ్యశ్రీ సీఎం జగనన్న పుణ్యమా అని విదేశీ విద్యాదీవెనలో భాగంగా లండన్‌లోని వార్విక్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తోంది.

– విద్యార్థిని రమ్యశ్రీ తల్లిదండ్రులు

కూరగాయల వ్యాపారం చేస్తుంటా..



మాది చిత్తూరు రూరల్ మండలం. నాది కూరగాయల వ్యాపారం. నా బిడ్డను విదేశాల్లో చదివించే స్తోమత నాకు లేదు. సీఎం జగనన్న చేస్తున్న మేలు మరువలేను. నా బిడ్డ రుచిత ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. – విద్యార్థిని రుచిత తండ్రి వరాలు

నేడు సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను చిత్తూరులో అట్టహాసంగా నిర్వహించడానికి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి భారీ ఏర్పాట్లు చేశారు. తిరుపతి రోడ్డులోని అయ్యప్ప గార్డెన్‌లో ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. చిత్తూరు నగరంతో పాటు చిత్తూరు రూరల్‌లో 44 వేల మంది మహిళలకు జగనన్న జన్మదినాన్ని పురస్కరించుకుని కానుకలు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం గుడిపాలలో 9 వేల మందికి జగనన్న కానుకలు అందిస్తామన్నారు. ఒక్కో మహిళలకు చీర, జాకెట్‌తో పాటు, భర్తకు ప్యాంటు, షర్టును ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

దేశంలోనే తొలిసారిగా ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు



బండ్లపల్లెలో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి



బంగారుపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డు గదిని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

పుంగనూరు: భారతదేశ చరిత్రలో తొలిసారిగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడం జరిగిందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బండ్లపల్లె గ్రామంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సర్పంచ్ సునీతమ్మతో కలసి స్మార్ట్‌కార్డులను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలో కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజలకు రూ.1000 నుంచి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు 2500 ఆస్పత్రుల్లో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ, దిశ యాప్‌లు ఇన్‌స్టాల్ చేసే విధంగా ప్రభుత్వం సూచించదన్నారు. తద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్యం, రక్షణ పర్యవేక్షణపై నిఘా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యశ్రీని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సల్మా, ఎంపీటీసీలు రాజ్యలక్ష్మి, నంజుండప్ప, నాయకులు గురివిరెడ్డి, ప్రభాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలను శుభ్రంగా పెట్టుకోండి

బంగారుపాళెం: ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన బంగారుపాళెం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులు, పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రికార్డు గదిని తనిఖీ చేశారు. గది చిందరవందరగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. రికార్డు గది ఇలాగేనా పెట్టుకునేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ భవనంలో కొత్త ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. అలాగే తగ్గువారిపల్లె గ్రామ సచివాలయాన్ని సందర్శించి, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అటెండన్స్ రిజిస్టర్‌లో సీఎల్ నమోదు, మూమెంట్ రిజిస్టర్‌లో క్యాంపు వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆడుకందాం ఆంధ్రా, వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. పలు రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్‌లో క్రిస్మస్ హైటీ

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో 22న క్రిస్మస్ హైటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు హైటీ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లాలోని చర్చిల ఉపాసకులు, క్రిస్టియన్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం అధికారులు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సర్కారు బడుల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు మొదటి విడతలో జిల్లాకు వచ్చిన 5,262 ట్యాబ్‌లను అందిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరింపేటలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరిగే ట్యాబ్‌ల పంపిణీకి సంబంధించి విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ షణ్మోహన్, ప్రజాప్రతినిధులు విచ్చేస్తారని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

మనసున్న మారాజు సీఎం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: నిరుపేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ 25 లక్షలకు పెంచుతూ తాను మనసున్న ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం తన తండ్రి బాటలో నడుస్తూ, మరో అడుగు ముందుకేసి 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలతోపాటు జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు గ్రామీణులకు చేరువ చేశారన్నారు. మించాగ్ తుపానుతో దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకుంటారని, రైతులకు నష్టపరిహారాన్ని సంక్రాంతి పండుగ నాటికి అందజేస్తామన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఇప్పుడు రైతుల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

విద్యుత్ షాక్‌తో మెకానిక్ మృతి



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన చేతన్‌బాబు

బిరాల: ద్విచక్రవాహనం వాటర్ సర్వీస్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని వైస్ గేటులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీ.ఎర్రేపల్లెకు చెందిన చేతన్‌బాబు(43) వైఎస్ గేటులో ద్విచక్రవాహన మెకానిక్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ద్విచక్రవాహనానికి వాటర్ సర్వీస్ చేస్తుండగా ఆ సమయంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబానికి ఆధారమైన భర్త చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రాణదాతలుగా అప్పట్లో వైఎస్సార్, ఇప్పుడు సీఎం జగనన్న
- ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మండల కేంద్రంలోని గంగవరం–1 సచివాలయం వద్ద బుధవారం ఆయన ప్రజలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రజారోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి ప్రాణదాతగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రస్తుతం అదే కోవలో ముఖ్యమంత్రి జగనన్న సైతం ప్రజల ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని ఏకంగా రూ.25 లక్షల వరకూ పెంచిన ప్రజలపై తనకున్న ప్రేమను చాటుకున్నారని అన్నారు. ఈ ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ చంద్రమ్మ, ఎంపీటీసీ లేఖ్య, వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును ఇంకా ఎందుకు నమ్మాలి ?



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

– ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పాడంటే చేస్తాడనే అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు నమ్ముతున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 4, 16, 17 వార్డుల్లో, మండల పరిధిలోని పైపాళ్యం గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి హేళనగా మాట్లాడిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడగానే అవే పథకాలకు పేరు మార్చి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఇంకా చంద్రబాబును ప్రజలు ఎందుకు నమ్మాలో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో 2014 ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన బాబు, అధికారం చేపట్టగానే అందరినీ నిలువునా మోసం చేశాడన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలన, 5 ఏళ్ల జగన్‌మోహన్ రెడ్డి పాలనను పోల్చుకుని ఎవరి పాలనలో ప్రతి కుటుంబానికీ మంచి జరిగిందో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఏడుసార్లు నమ్మి చంద్రబాబును గెలిపించారని, ఈసారి మీ ఇంటి బిడ్డగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ భరత్ మహిళలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు మునస్వామి, హఫీజ్, నాయకులు మురుగేష్, జెడ్పీటీసీ శరవణ, రంగయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై రైతుల కన్నెర్ర



చందన ట్రేడర్స్ దుకాణం వద్ద గుమికూడిన రైతులు

- దుకాణాన్ని ముట్టడించిన బాధిత రైతులు

వి.కోట: పట్టణంలో ఓ ఫర్టిలైజర్స్ దుకాణదారుడు ఇచ్చిన నకిలీ విత్తనాలతో తాము ఆర్థికంగా నష్టపోయామని, అతనిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పలువురు రైతులు బుధవారం డిమాండ్ చేశారు. మండలంలోని గాండ్లపల్లెకు చెందిన చంద్రబాబు స్థానిక చందన ట్రేడర్స్‌లో మూడు నెలల ముందు మొక్కజొన్న విత్తనాలను కొని పంట వేశాడు. అయితే ఆ పంటలో 10 మొక్కలకుగాను ఒకమొక్కలోనే మొక్కజొన్న కండెలు మిగిలిన వాటిల్లో లేకపోవడంతో బాధిత రైతులంతా దుకాణాన్ని ముట్టడించారు. తమకు ఎలాంటి సంబంధం లేదని, విత్తనాల కంపెనీ వాళ్లతో మాట్లాడుకోండని దుకాణదారులు చెప్పడంతో మండిపడ్డారు. పంట సాగుకు దాదాపు 50,000 వేల రూపాయలు ఖర్చు చేసిన సొమ్ము నష్టపోయానని బాధిత రైతు చంద్రబాబు తన ఆక్రోశం వెళ్లగక్కాడు. రైతుల ముట్టడిని తెలుసుకున్న వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఆ విత్తనాలను సీజ్ చేస్తామని, దుకాణదారుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చెరుకు తోటలో ఏనుగుల బీభత్సం



వెలుతురుచేనులో ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకు పంట

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేను పంచాయతీ ఒంటిల్లు సమీపంలో మంగళవారం రాత్రి ఓ చెరుకు తోటపై ఏనుగులు దాడి చేసి పంటను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన మహిళా రైతు చిన్నమ్మకు సంబంధించిన చెరుకు తోటపై సుమారు 10 ఏనుగులు పంటను ధ్వంసం చేశాయని వాపోయింది. గతవారం రోజులుగా ఏనుగులు రాగిమానుపెంట, బీబీఎల్ కండ్రిగ, కీరమంద, రాళ్లవంక, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో పంటపొలాలపై దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి, చెరుకు, అరటి పంటలను నాశనం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఫారెస్టు బీట్ అధికారి ప్రతాప్ నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు. పంటపొలాలపై ఏనుగులు రాకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని రైతులు అటవీశాఖ కోరారు. బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలను పంపిస్తామన్నారు.

23న వరదరాజుల స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాకం(యాదమరి): ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయమైన శ్రీ వరదరాజుల స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరదరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నందున స్వామివారికి ప్రధాన ఆలయం నుంచి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు వివరించారు.

28న ధర్మకర్తల మండలి సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 11 గంటలకు ఆలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ధర్మకర్తలి మండలి సభ్యులు హాజరు కావాలని కోరారు.

తేనెటీగల పెంపకంపై అంతర్జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో బుధవారం తేనెటీగల పెంపకం, అభివృద్ధి అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభమైంది. వీసీ భారతి మాట్లాడుతూ ఏపికల్చర్ ప్రాధాన్యతను వివరించారు. ఆచార్య సామసూల్ రజిత్ మాట్లాడుతూ మలేషియా వర్సిటీలో ముళ్లులేని తేనెటీగల పెంపకం, తేనె సేకరణ పద్ధతులను తెలియజేశారు. మలేషియా నుంచి విచ్చేసిన మన్సూరు ఇస్మాయిల్ మాట్లాడుతూ ముల్లు లేని తేనెటీగల ద్వారా సేకరించే తేనే ద్వారా ఉత్పత్తుల తయారీని తెలియజేశారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉద్యోగాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కంపెనీల ప్రతినిధులు

- వివిధ కంపెనీల్లో 127 మందికి ఉద్యోగాలు
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: రాష్ట్రప్రభుత్వం ఉపాధికల్పనే లక్ష్యంగా జాబ్‌మేళాలను నిర్వహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 23 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్న జాబ్‌మేళాలో 321 మంది అభ్యర్థులు పాల్గొనగా 127 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కళాశాల ప్రతినిధులు టి.నరసింహులు, ఎ.సంధ్య, పి.సుజన, కిషోర్, రసూల్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు చైతన్య, అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న అధికారులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ మెయిన్స్ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డైట్‌లో నిర్వహించిన కౌశల్ 2023 జిల్లాస్థాయి మెయిన్స్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు జిల్లా నుంచి 56 స్కూళ్లకు 130 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, అందులో 36 స్కూళ్ల విద్యార్థులు క్విజ్ పోటీలకు, 20 పాఠశాలల విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో రాష్ట్రస్థాయి పోటీలకు మొదటి స్థానంలో ఎంపీపీ పాఠశాల సదుం, జీహెచ్‌ఎస్ చిత్తూరు, అలాగే రాష్ట్రస్థాయి పోస్టర్ ప్రజెంటేషన్‌కు జెడ్పీహెచ్‌ఎస్ పుదుపేట నగరి, జెడ్పీహెచ్‌ఎస్ 49 కొత్తపల్లి మిట్ట స్కూళ్లు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్‌రాజు, చెంగల్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుదుపేట పాఠశాలకు ఫస్ట్ ప్రైజ్

నగరి : జిల్లాస్థాయిలో నిర్వహించిన కౌశల్ క్విజ్ పోటీల్లో మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి దక్కిందని హెచ్‌ఎం టీవీ రమేష్ తెలిపారు. ×సుస్థిర అభివృద్ధి కొరకు హరిత శక్తి₹ అనే అంశంపై క్విజ్ నిర్వహించగా విద్యార్థి హరిప్రియ, గైడ్ టీచర్ శశిరేఖ ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనభరచి ప్రథమ బహుమతి దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

రక్త నిర్ధారణ టెస్ట్‌లు చేస్తున్నారా ?



గుడిపాల: విద్యార్థులకు అందజేస్తున్న మాత్రలను తనిఖీ చేస్తున్న ప్రభావతి

గుడిపాల: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓ ప్రభావతి అన్నారు. బుధవారం ఆమె నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని ప్రతివారం వైద్యసిబ్బంది వచ్చి ఐరన్ మాత్రలు ఇచ్చి, హిమోగ్లోబిన్ టెస్ట్‌లు చేస్తున్నారా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార భోజనం తింటున్నారా ? ఏమైనా పడేస్తున్నారా ? అని ఆరా తీశారు. ప్రతి గురువారం విద్యార్థులకు వైద్యసిబ్బంది అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట డాక్టర్ సంధ్య, ఏఎన్‌ఎం జబసెల్వీ, హెచ్‌ఎం ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు నూతన కార్యాలయం ప్రారంభం



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న పీడీ తులసి, ఇండియన్ బ్యాంకు అధికారులు

గంగాధర నెల్లూరు: మండలంలోని ఎస్‌ఎస్ కొండలో ఇండియన్ బ్యాంకు శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనానికి శాఖను మార్చారు. బుధవారం నూతన కార్యాలయాన్ని డీఆర్‌డీఓ పీడీ తులసి, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సెల్వరాజ్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.4కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామక్క, డీజీఎం రాజేష్, బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది, ఖాతాదారులు, రైతులు పాల్గొన్నారు.

నగలు లాక్కుని..బైక్‌లో స్నాచర్లు జంప్



మదనపల్లెలో లక్ష్మీదేవి మెడలో నుంచి చైనులాగుతున్న దొంగ

పుంగనూరు: మహిళల మెడ నుంచి బంగారు చైన్లు లాక్కొని బైక్‌లో చెయిన్ స్నాచర్లు ఉడాయించిన సంఘటన పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని సుగాలిమిట్టతాండలో అంగన్‌వాడీ టీచర్ బి.సుశీల తన ఇంటికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతుండగా ఇద్దరు ఆగంతకులు మోటార్ సైకిల్‌లో వచ్చి మదనపల్లెకు ఎటు వెళ్లాలి? అని అడిగారు. ఆమె సమాధానం చెప్పేలోపు హఠాత్తుగా ఆమె మెడలోని దాదాపు 40 గ్రాముల బంగారు చెయిన్‌ను లాక్కుని బైక్‌పై ఉడాయించారు. అక్కడి నుంచి నేరుగా చౌడేపల్లె మండలం బత్తలాపురం క్రాస్‌లో ఇదే తరహాలో తమ ప్రతాపం చూపారు. అక్కడ రుక్మిణమ్మ అనే మహిళ పొలం వద్దకు వెళ్లి తిరిగి రోడ్డుపైకి వస్తుండగా.. బోయకొండకు ఎలా వెళ్లాలి? అని అడుగుతూ ఆమె మెడలోని 17 గ్రాముల బంగారు చైను లాక్కెళ్లిపోయారు. తొలుత ఈ ఇద్దరు కేటుగాళ్లు అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె రోడ్డులో లక్ష్మీదేవమ్మ అనే మహిళ ఇంటి ముందు కూర్చుని ఉండగా 40 గ్రాముల బంగారు చైను లాక్కెళ్లారు. అక్కడ సీసీ కెమెరాలో ఇది రికార్డైంది. పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో చెయిన్ స్నాచింగ్‌పై సీఐ రాఘవరెడ్డి కేసులు నమోదు చేశారు. చెయిన్ స్నాచర్ల కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.

జగనన్న వెంటే జనం



అలిపిరిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

తిరుపతి కల్చరల్ : సంక్షేమ పథకాలతో ప్రజారంజకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. జయహో జగనన్న పేరిట విజయనగరం జిల్లా నుంచి తిరుమలకు ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం తిరుపతిలోని అలిపిరి చేరుకుంది. వారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంవీఎస్ మణి ఘన స్వాగతం పలికారు. అనంతరం అలిపిరి పాదాల మండపం వద్ద ఎమ్మెల్సీ రఘురాజు కొబ్బరికాయలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 200 మందితో 43 రోజులుగా సుమారు 800 కిలో మీటర్లు పాదయాత్ర సాగిందన్నారు. సంక్షేమ సారథి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పథకాలు అమలు చేశారన్నారు.

ఎన్నికల హామీల్లో 95 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాలని ఆకాంక్షిస్తూ తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు. జగనన్న పుట్టినరోజు నాడు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు వివరించారు.